సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 23 । జనవరి । 2023



హీటెక్కిన ఇల్లెందు
ఇల్లెందు రాజకీయం హీటెక్కుతోంది. అధికార పార్టీ నాయకులు పోటాపోటీగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. 8లో



అండగా ఆపరేషన్ స్మైల్..
ప్రభుత్వం ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం ద్వారా బాలకార్మికులను గుర్తించి, చేరదీసి, విద్యాబుద్ధులు నేర్పిస్తోంది. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 18°

వాతావరణం
జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉంటాయి. రాత్రి వేళ చలి ప్రభావం ఉంటుంది.

‘పోడు’ ఇచ్చేనా..?



పోడు భూములను క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

హక్కు పత్రాల పంపిణీలో కాలయాపన

- 2021లో దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం
- గత నవంబర్‌లో ఎఫ్‌ఆర్సీ గ్రామసభల్లో విచారణ
- డివిజన్‌స్థాయి కమిటీల వద్ద ఆగిన ప్రక్రియ
- ఆ తర్వాత జిల్లాస్థాయి కమిటీ పరిశీలన, పట్టాల మంజూరుకు ఇంకెంత కాలమో!

చుంచుపల్లి: పోడు పట్టాల జారీలో జాప్యం జరుగుతుండటంతో దరఖాస్తుదారులు నిరాశ చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడిందని, అందుకే కాలయాపన చేస్తోందని గిరిజనులు పేర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు 2021 నవంబరు 8 నుంచి డిసెంబరు 16 వరకు జిల్లాలో పోడు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అర్జీల ఆధారంగా క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి చేసి గతేడాది నవంబర్‌లో గ్రామసభలను సైతం నిర్వహించారు. సభల్లో ఎఫ్‌ఆర్సీ కమిటీలు దరఖాస్తులపై పూర్తిస్థాయిలో చర్చించి నిబంధనలకు విరుద్ధంగా ఉన్నవాటిని తిరస్కరించారు. సరైన దరఖాస్తులను డివిజన్ స్థాయి కమిటీకి పంపారు. ఇక అక్కడి నుంచి ప్రక్రియ ముందుకు సాగడం లేదు. జిల్లాలో 82,895 మంది రైతులు 2,97,410 ఎకరాల్లో పోడు హక్కు పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో గిరిజన రైతులు 65,315 మంది, గిరిజనేతరులు 17,580 మంది ఉన్నారు. అధికారులు పోడు గ్రామసభలు నిర్వహించి నెలలు గడుస్తున్నా పట్టాలు మాత్రం జారీ చేయడంలేదు. త్వరలోనే పోడు పట్టాలు జారీ చేస్తామని స్వయంగా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ప్రకటన చేసినా ఆచరణలో అమలు కావడంలేదు.

తొలి దశలోనే దరఖాస్తుల తిరస్కరణ..

జిల్లాలో 332 గ్రామపంచాయతీల పరిధిలోని 726 ఆవాస గ్రామాల్లో పోడు భూములు సాగులో ఉన్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. నిబంధనల ప్రకారం గిరిజనులైతే 2005 డిసెంబర్ 13 కంటే ముందు నుంచి పోడు సాగులో ఉండాలి. ఒక వేళ గిరిజనేతరులైతే మూడు తరాల నుంచి భూమి సాగుచేస్తున్నట్లు ఆధారాలు చూపాలి. జిల్లాలో చాలా మంది దరఖాస్తుదారుల వద్ద ప్రభుత్వ నిబంధనల ప్రకారం పోడు భూముల్లో ఉంటున్నట్లు ఎలాంటి ఆధారాలు లేనట్లు తెలిసింది. ఎఫ్‌ఆర్సీ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన గ్రామసభల్లో ఎక్కువ దరఖాస్తులను అధికారులు తొలి దశలోనే తిరస్కరించారు. జిల్లాలో 82,895 దరఖాస్తులను పరిశీలించిన అధికారులు 62,502 దరఖాస్తులనే డివిజన్ కమిటీకి సిఫారసు చేశారు. ఇందులో 50,904 దరఖాస్తులు గిరిజనులవి, మరో 11,598 గిరిజనేతరులవి ఉన్నాయి. ఇక అధికారులు 20,393 దరఖాస్తులను తిరస్కరించగా, వాటిలో గిరిజనుల దరఖాస్తులు 14,411, గిరిజనేతరులవి 5,982 ఉన్నాయి. వివిధ కారణాలతో మరో 800 దరఖాస్తులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం పోడు పట్టాల ప్రక్రియ డివిజన్ కమిటీ స్థాయిలోనే ఉంది. గ్రామ స్థాయిలో అనుమతి పొందిన దరఖాస్తులను డివిజన్ కమిటీ స్థాయిలో కొన్నింటిని తిరస్కరించే అవకాశం కూడా ఉంది. అనంతరం జిల్లాస్థాయి కమిటీల చేతుల్లోకి వెళ్తుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు చివరగా అర్హులను ప్రకటిస్తారు. కాగా క్షేత్ర స్థాయిలో ఎక్కువ మంది అనర్హులే దరఖాస్తు చేసుకున్నారని, అటవీ హక్కుల చట్టం ప్రకారం జిల్లాలో కేవలం 20 శాతంలోపు రైతులకే పోడు భూమిపై హక్కులు దక్కే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వ నిర్ణయం ప్రకారం..



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎఫ్‌ఆర్సీ కమిటీల ఆధ్వర్యంలో గ్రామసభల్లో పోడు దరఖాస్తులపై చర్చించారు. డివిజన్ కమిటీలకు నివేదికలు అందించారు. తొలి దశలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కొన్ని దరఖాస్తులను అనుమతించలేదు. ప్రస్తుతం డివిజన్ స్థాయిలో పరిశీలన జరుగుతోంది. పోడు పట్టాల జారీపై ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలూ అందలేదు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం పట్టాలను జారీ చేస్తాం.
–రంజిత్ నాయక్, డీఎఫ్‌ఓ

25 నుంచి స్వరరాగ ఝురి..



చిత్రకూట మండపంలో జరుగుతున్న వాగ్గేయకారోత్సవాలు (ఫైల్)

- భక్త రామదాసుకు స్వర నీరాజనం
- ఐదు రోజుల పాటు కొనసాగనున్న వాగ్గేయకారోత్సవాలు
- పలు రాష్ట్రాల నుంచి తరలిరానున్న సంగీత కళాకారులు

భద్రాచలం: భద్రాద్రి రామయ్యకు అపర భక్తాగ్రేసరుడు, భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం నిర్మాణ కర్త అయిన భక్త రామదాసు 390వ జయంతి ఉత్సవాలకు భద్రాచలం వేదిక కానుంది. రాముడిపై భక్తితో ఆలయాన్ని నిర్మించడమే కాక అనేక కీర్తనలను స్వయంగా రచించి ఆలపించిన ఘనత భక్త రామదాసుది. అంతటి మహనీయుడికి స్మృతిగా శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ప్రతి ఏడాది వాగ్గేయ కారోత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే గత రెండు సంవత్సరాలు కోవిడ్ ప్రభావంతో నిరాడంబరంగా జరిపిన ఈ వేడుకలను ఈ ఏడాది ఎలాంటి ఆంక్షలు లేకపోవడంతో జయంతి ఉత్సవాలను ఈ నెల 25 నుంచి 29 వరకు వైభవోపేతంగా నిర్వహించాలని ఆలయ అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో పలు పట్టణాలు, రాష్ట్రాల నుంచి వివిధ సంగీత కళాకారులతో సాంస్కృతిక ప్రదర్శనల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించారు. ఈ ఐదు రోజులు భద్రాచలం ‘స్వరరాగ ఝురి’లో ఓలలాడనుంది.

అలరించనున్న నవరత్న ఘోష్టి..

భక్త రామదాసు జయంతి సందర్భంగా వాగ్గేయ కారోత్సవాలను వైభవంగా నిర్వహించడం, వివిధ రాష్ట్రాల నుంచి ప్రముఖ సంగీత కళాకారులను భద్రాచలానికి తీసుకొచ్చి రామయ్య సన్నిధిలో ప్రదర్శనలు ఇప్పించడంలో చక్ర సిమెంట్స్ అధినేత నేండ్రగంటి కృష్ణమోహన్‌ది కీలక పాత్ర. ఆయన నేతృత్వంలో నేండ్రగంటి అలివేలు మంగ సర్వయ్య చారిటబుల్ ట్రస్ట్ పేరిట హైదరాబాద్, బెంగళూర్, చెన్నై, విజయవాడ నుంచి వచ్చిన సంగీత విద్వాంసులు ఆలపించే ‘నవరత్న ఘోష్టి’ అలరిస్తుంది. ఈ మధురిమలను వినాలంటే వాగ్గేయకారోత్సవాలు జరిగే చిత్రకూట మండపానికి రావాల్సిందే. ఈ జయంతి ఉత్సవాల్లో ప్రఖ్యాత సంగీత విద్వాంసులు మల్లాది సూరిబాబు, అతని కుమారులు మల్లాది శ్రీరామ్‌కుమార్, రవికుమార్‌తో పాటు పలువురు విద్వాంసులు పాల్గొననున్నారు.

ఆద్యంతం ఆకట్టుకునేలా..

ఈనెల 25 నుంచి 29 వరకు చిత్రకూట మండపంలో వాగ్గేయకారోత్సవాలు ఆద్యంతం ఆకట్టుకునేలా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 25న నగర సంకీర్తన, రామదాసు విగ్రహానికి అభిషేకం అనంతరం ఆలయ ఈఓ శివాజీ ఉత్సవాలను ప్రారంభిస్తారు. నవరత్న కీర్తనల ఘోష్టితో పాటు మల్లాది రవికుమార్ రచించిన ఆదిభట్ల నారాయణదాసు కీర్తనల పుస్తకావిష్కరణ, వివిధ సంగీత విద్వాంసుల ప్రదర్శనలు ఉంటాయి. 26న దేవస్థాన నాదస్వర, భజన బృందం, అమెరికాకు చెందిన విజ్జి సోమనాథ్, తెలుగు యూనివర్సిటీ బృందం, నేండ్రగంటి కృష్ణమోహన్‌తో పాటుగా ఇతరులు ప్రదర్శనలు ఇవ్వనున్నారు. 27న చెన్నై, హైదరాబాద్, విజయవాడకు చెందిన కళాకారులచే, 28, 29 తేదీల్లో హైదరాబాద్‌కు చెందిన బృందాలచే శాస్త్రీయ సంగీత కార్యక్రమాలు ఉంటాయి.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



కల్యాణ వేడుక నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి వారి దేవస్థానంలో మూలమూర్తులకు ఆదివారం సందర్భంగా అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మ వారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రసాదాలను స్వీకరించారు.

శ్రీకనకదుర్గమ్మ తల్లికి విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: శ్రీకనకదుర్గమ్మ తల్లికి ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్ ద్వారా వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. తలనీలాలు సమర్పించారు. ఒడిబియ్యం, చీరలు, కుంకుమ, పసుపు, గాజులు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. అర్చకులు అమ్మవారికి అభిషేకం పూజలు జరిపారు. ఈఓ ఎస్.రజనీకుమారి పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న కొత్తగూడెం డీఎస్పీ



పెద్దమ్మతల్లి సన్నిధిలో కొత్తగూడెం డీఎస్పీ వెంకటేశ్వరబాబు, కుటుంబసభ్యులు

కొత్తగూడెం డీఎస్పీ వెంకటేశ్వరబాబు ఆదివారం కుటుంబ సమేతంగా పెద్దమ్మ తల్లిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వారికి అమ్మవారి శేష వస్త్రప్రసాదాలను అందజేశారు. డీఎస్పీ వెంట రూరల్ ఎస్‌ఐ శ్రీనివాస్ ఉన్నారు.

అండర్ మేనేజర్ రాత పరీక్ష



పర్యవేక్షిస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణివ్యాప్తంగా ఖాళీగా ఉన్న 27 అండర్ మేనేజర్ గ్రేడ్–2(ఇంటర్నల్) పోస్టులకు ఆదివారం రాత పరీక్ష నిర్వహించారు. సింగరేణి మహిళా కళాశాలలో పరీక్ష నిర్వహించగా, 226 మంది హాజరయ్యారు. మొత్తం 236 మంది హాజరుకావాలి ఉండగా, 10 మంది గైర్హాజరయ్యారని పరీక్షలను పర్యవేక్షించిన సింగరేణి పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) విభాగం జీఎం కట్టా బసవయ్య తెలిపారు. హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ఫలితాలు తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని, అభ్యర్థులు గమనించాలని కోరారు. అధికారులు పిచ్చయ్య శాస్త్రి, బి హనుమంతరావు, ధన్‌పాల్ శ్రీనివాస్, శారద, పీవీ శాస్త్రి, వేణుగోపాల్, చంద్రశేఖర్, జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్‌ఓ) అశోక చక్రవర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను లిఖిత పూర్వకంగా అందజేయాలని సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ముగిసిన బాలోత్సవ్



బాలోత్సవ్ పోటీలకు హాజరైన విద్యార్థులు

- రెండురోజులపాటు పిల్లల సాహిత్య వేడుక
- విజేతలకు బహుమతుల ప్రదానం

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం క్లబ్‌లో శనివారం ప్రారంభమైన బాలోత్సవ్ ఆదివారం ముగిసింది. పోటీలకు జిల్లావ్యాప్తంగా 80 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 8,9,10 తరగతుల విద్యార్థులు 235 మంది హాజరయ్యారు. బాలోత్సవ్ చిల్డ్రన్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కథా, కవితా రచనల వర్క్‌షాపులో ప్రతిభ చూపారు. పలువురు కవులు, కథకులు చిన్నారులకు కథ, కవితా రచనపై కార్యశాలలో అవగాహన కల్పించారు. ముగింపు వేడుకలకు డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ నాగరాజు హాజరై మాట్లాడారు. రచయితల సలహాలు సూచనలు తీసుకుని రచనలపై దృష్టి సారించాలని చిన్నారులకు సూచించారు.

విజేతలు వీరే..

కథల పోటీలో పాల్వంచ డీఏవీ మోడల్ పాఠశాల 8వ తరగతి విద్యార్థి బి.ఫణీంద్ర ప్రథమ బహుమతిని గెలుచుకున్నారు. తల్లాడ బాలభారతి పాఠశాల 9వ తరగతి విద్యార్థి టి.అజయ్ ద్వితీయ బహుమతి, పాల్వంచ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల 9వ తరగతి విద్యార్థి ఎస్.సింధు తృతీయ బహుమతిని పొందారు. కవితా రచన పోటీల్లో కొత్తగూడెం కేఎస్‌ఆర్ పాఠశాల పదో తరగతి విద్యార్థి హెచ్.అఖిల్ ప్రథమ బహుమతి, పాల్వంచ డీఏవీ మోడల్ పాఠశాల విద్యార్థి జనిత్‌రోజ్ ద్వితీయ బహుమతి, కొత్తగూడెం సెయింట్ మేరీస్ హైస్కూల్ విద్యార్థి కె.మేరి తపస్వి తృతీయ బహుమతిని కైవసం చేసుకున్నారు. విజేతలకు డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్‌నాగరాజు బహుమతులు అందజేశారు. పోటీలకు ఉభయ రాష్ట్రాలకు చెందిన ప్రముఖ కవులు, కథకులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో రచయితలు, కవులు అనిల్ డ్యానీ(విజయవాడ), కరుణ తాయమ్మ(హైదరాబాద్), చందు తులసి (హైదరాబాద్), రవికుమార్(దాచేపల్లి), కటుకోజ్వల రమేష్(ఖమ్మం), కొత్తగూడేనికి చెందిన భగవంత, శీరంశెట్టి కాంతారావు, మండవ సుబ్బారావు, మధుసూదన్, సూర్యనారాయణ, క్లబ్ మేనేజర్ మల్సూరు పాల్గొన్నారు.



విద్యార్థినికి బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

కేటీపీఎస్‌లో బూడిద సిండికేటు!

- అధిక ధరకు విక్రయిస్తున్న టెండర్‌దారులు
- అధికారులకు ముడుపులు, కొరవడిన పర్యవేక్షణ
- తగ్గుతున్న బూడిద వినియోగం, జెన్‌కోకు నష్టం



కేటీపీఎస్ బూడిద చెరువు

పాల్వంచ: కేటీపీఎస్ కర్మాగారం నుంచి వెలువడే బూడిద తరలింపుపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. అక్రమాలు చోటు చేసుకుంటున్నా జెన్‌కో విజిలెన్స్ దృష్టిసారించడంలేదు. మిగతా టెండర్ల మాదిరిగా ఈ–టెండర్ ప్రక్రియ పాటించకుండా హైదరాబాద్ విద్యుత్ సౌధలో బాక్స్ టెండర్లు నిర్వహిస్తుండటం కూడా అక్రమార్కులకు కలిసివస్తోంది. దీంతో కొందరు ఏజెన్సీ నిర్వాహకులే అనుమతులు పొంది, అనంతరం మరికొందరితో కుమ్మక్కై ఇష్టారాజ్యంగా విక్రయించుకుంటున్నారు. బయట మార్కెట్‌లో ధర అమాంతం పెంచి అమ్ముతున్నారు. దీంతో బూడిద వినియోగం 100 శాతం జరగాల్సి ఉండగా 50శాతానికే పరిమితమవుతుందని పలువురు పేర్కొంటున్నారు. ఫలితంగా జెన్‌కో సంస్థకు నష్టం జరుగుతోంది.

నిర్వాహకుల ఇష్టారాజ్యం..

కేటీపీఎస్ 5,6,7 దశల ద్వారా 1800 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. ఉత్పత్తి కోసం నీరు, బొగ్గును అధిక మొత్తంలో వినియోగిస్తారు. బొగ్గు మండించడం ద్వారా వచ్చే బూడిదను పుల్లాయిగూడెం–సూరారం గ్రామాల సమీపంలోని సుమారు 300 ఎకరాల్లో ఉన్న బూడిద చెరువుకు తరలిస్తారు. అక్కడి నుంచి ఏజెన్సీల ద్వారా విక్రయిస్తారు. కాగా అనుమతి పొందిన తొమ్మిది ఏజెన్సీలతో సుమారు 60 మంది సిండికేట్‌గా ఏర్పడిన బూడిద వంతుల వారీగా అమ్మకాలు చేపట్టడం బహిరంగ రహస్యంగా మారింది. వారి చెప్పిన ధరకే కొనుగోలు చేయాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. టన్ను బూడిదకు రూ.75 చొప్పున అనుమతి తీసుకుని లారీల్లో లోడ్ చేసినందుకు రూ.300 వరకు తీసుకుంటున్నారు. లారీలు బయటకు వెళ్లాక రూ.వేలల్లో అమ్మకం చేసుకుంటున్నారు. గ్రామం మీద నుంచి బూడిద తోలుతున్నారనే నెపంతో సుమారు 60 మంది వరకు ఏజెన్సీలతో సిండికేట్ అయి వాహనానికి ఇంత రేటు చొప్పున వసూలు చేస్తున్నట్లు సమాచారం. అధికారులకు ముడుపులు అందుతుండటంతో వారూ పట్టించుకోవడం లేదు. కేఎస్‌పీ రోడ్డులో కేటీపీఎస్ ఏడో దశ ప్రధాన గేటు ముందు టోల్ గేటు మాదిరిగా సిండికేట్‌దారులు అడ్డాగా చేసుకున్నట్లు తెలుస్తోంది. బూడిద కొనుగోలు కోసం సరిహద్దు ఖమ్మం, నల్లగొండ, వరంగల్, హైదరాబాద్, ఆంధ్రా ప్రాంతానికి చెందిన బండ్లు సైతం వస్తుంటాయి. బూడిద తరలించేటప్పుడు వాహనాలపై సక్రమంగా పట్టాలు కప్పడం లేదు. దీంతో రహదారులపై గాలికి లేచి వాహనదారుల కళ్లలో పడుతుండటంతో ప్రమాదాలు నెలకొనే పరిస్థితి ఏర్పడుతోంది.

టెండర్లు లేకుండానే మరో నలుగురికి..

గతంలో హైదరాబాద్‌లో బాక్స్ టెండర్ల ద్వారా తొమ్మిది ఏజెన్సీలకే అనుమతులు ఇవ్వగా, ఇటీవల టెండర్లు లేకుండానే మరో నాలుగు ఏజెన్సీలకు అనుమతులు ఇవ్వడంతో అధికారుల తీరుపై విమర్శలు వస్తున్నాయి. తమ ఇష్టం వచ్చిన వారికే అనుమతులు ఇస్తున్నారని, మిగతా వారికి ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. వంద శాతం బూడిద వినియోగం జరగాలనే నిబంధనలో భాగంగా మరికొందరికి సైతం అనుమతులు ఇచ్చామని యాజమాన్యం పేర్కొంటోంది. బాక్స్ టెండర్లు కాకుండా ఆన్‌లైన్ టెండర్లను పిలవాలని పలువురు ఆశావహులు కోరుతున్నారు. సిండికేట్ వల్ల తరచూ ఘర్షణ వాతావారణం చోటుచేసుకుంటోందని, ఈ వ్యవహారంపై జెన్‌కో విజిలెన్స్ దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

మా దృష్టికి వచ్చాయి..



సిండికేట్ వ్యవహారం, అధిక ధరకు విక్రయాలు, గొడవలు వంటి సమస్యలు మా దృష్టికి వచ్చాయి. అందుకే వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఈ–టెండర్ ప్రక్రియ అవలంబించాలనే ఆలోచన ఉంది. కేటీపీఎస్ కర్మాగారాల నుంచి వెలువడే బూడిదను వందశాతం వినియోగించాలన్నదే సంస్థ లక్ష్యం. తొమ్మిదింటికే గాక ఇటీవల మరో నాలుగు ఏజెన్సీలకు సమాన రేటుకు అనుమతులు ఇచ్చాం. దీని వల్ల ఎవరికీ నష్టం లేదు.
–అజయ్, జెన్‌కో డైరెక్టర్(సివిల్)

ఏఈఈ పరీక్ష ప్రశాంతం

కేంద్రాలను పరిశీలించిన ఖమ్మం కలెక్టర్, అదనపు కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈఈ) పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సంబంధించి ఖమ్మం నగరంతో పాటు సమీపంలో 19 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 6,664 మంది అభ్యర్థులకు గాను ఉదయం పరీక్షకు 5,194 మంది హాజరు కాగా 1,470 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 6,664 మందికి గాను 5,166 మంది హాజరు కాగా 1498 మంది గైర్హాజరయ్యారు.

నిమిషం నిబంధన అమలు..

పరీక్ష కేంద్రాల్లో నిమిషం నిబంధనను అధికారులు పటిష్టంగా అమలు చేశారు. ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల కేంద్రంలో ఓ అభ్యర్థిని ఐదు నిమిషాలు ఆలస్యంగా రాగా వెనక్కు పంపించారు. పలు కేంద్రాలకు చివరి నిమిషాల్లో అభ్యర్థులు ఉరుకులు, పరుగుల మీద చేరుకున్నారు. కొద్ది మంది చంటి పిల్లలతో రాగా.. పలువురు గర్భిణులు సైతం పరీక్షకు హాజరయ్యారు.

కలెక్టర్, అదనపు కలెక్టర్ తనిఖీ..

నగరంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్, అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్ పరిశీలించారు. కార్యక్రమంలో లైజనింగ్ అధికారులు కారుమంచి శ్రీనివాసరావు, రవిబాబు, అసిస్టెంట్ లైజనింగ్ అధికారులు కరుణ, కృష్ణ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఖమ్మం కలెక్టర్ గౌతమ్



ఎస్‌ఆర్‌అండ్ బీజీఎన్‌ఆర్ పరీక్ష కేంద్రంలో నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు

ఆంగ్లభాషపై పట్టు సాధించాలి

పాల్వంచరూరల్: తెలుగు మీడియం పాఠశాలలు ఇంగ్లిష్ మీడియం పాఠశాలలుగా మారుతున్న తరుణంలో తెలుగు మీడియానికి చెందిన ఉపాధ్యాయులు ఆంగ్లభాషపై పట్టు సాధించాలని కేటీపీఎస్ 5,6 దశల చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్ సూచించారు. మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు తెలంగాణ ఎస్‌ఈఆర్‌టీ, విల్‌టూకెన్ ఇంగ్లిష్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో వర్క్‌షాపు నిర్వహించారు. భాష ట్రైనర్ ఎ.రామేశ్వర్‌గౌడ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మెలకువలు వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.చిన్నప్పయ్య అధ్యక్షతన జరిగిన ముగింపు సదస్సులో సీఈ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఆంగ్లభాషపై పట్టు సాధించినప్పుడే నాణ్యమైన బోధన సాధ్యమవుతుందని అన్నారు.



మాట్లాడుతున్న కేటీపీఎస్ సీఈ ప్రభాకర్

ఈ కార్యక్రమంలో కేటీపీఎస్ డీఈ వరప్రసాద్ రావు, వెల్ఫేర్ అధికారి రాధాకృష్ణ, అధ్యాపకులు విజయ్‌కుమార్, సూరపల్లి రాంబాబు, 375 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ఇల్లెందుకు కేంద్ర మంత్రి రాక

ఇల్లెందు: కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును, బీజేపీ పటిష్టత కోసం బూత్ కమిటీ సభ్యులతో చర్చించేందుకు కేంద్ర ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ, సహకార శాఖ సహాయ మంత్రి బీ.ఎల్. వర్మ ఇల్లెందుకు రానున్నారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి జి.రాంచందర్ నాయక్, నియోజకవర్గ కన్వీనర్ బలగానీ గోపీ కృష్ణ తెలిపారు. ఆదివారం పట్టణ బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సాగిస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు, కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను దారి మళ్లిస్తున్న తీరును వివరించేందుకు నిర్వహించే ఈ సభలను ప్రజలు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సభకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, జిల్లా ఇన్‌చార్జ్ రాకేష్‌రెడ్డి, ప్రభారీ రాజ్యవర్ధన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణలు హాజరువుతున్నట్లు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి పొంగులేటి విరాళం



విరాళం అందజేస్తున్న పొంగులేటి, పాయం

మణుగూరుటౌన్: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణం కోసం స్థానిక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో ఆర్థిక సాయమందించారు. ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు పొంగులేటికి ఆలయ నిర్మాణ విషయం విన్నవించగా.. స్పందించిన ఆయన విరాళం అందజేసి ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా తాను అందిస్తామని హామీ ఇచ్చారు. ఈమేరకు ఆలయ కమిటీ సభ్యులు పొంగులేటికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, మండల వైస్ ఎంపీపీ కరివేద వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్‌లు తరుణ్‌రెడ్డి, కనకయ్య, ఆలయ కమిటీ సభ్యులు ఎస్‌వీ నాయుడు, రాంరెడ్డి, లక్ష్మణ్, సుబ్బారెడ్డి, జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న జిల్లా ఎస్పీ వినీత్

కొత్తగూడెంటౌన్: గత ఏడాది అనారోగ్యంతో మరణించిన కానిస్టేబుల్ రవి కుటుంబానికి తోటి బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్లు అండగా నిలిచారు. ఆదివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో 2000 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్లు ఎస్పీ డాక్టర్ వినీత్‌ను కలిసి వారందరూ సమకూర్చిన రూ.2.05లక్షలను ఎస్పీ చేతులమీదుగా రవి కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆర్థిక సాయమందించిన కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు ఆజయ్, చందులాల్, ముత్తయ్య, గరిడేపల్లి రవి, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

20ఏళ్ల అ'పూర్వ' కలయిక




ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: రుద్రంపూర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో చదివిన పూర్వవిద్యార్థులు (2003–04 బ్యాచ్) ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 20 ఏళ్ల తరువాత ఒకే చోట చేరి నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు పలకరించుకొని పిల్లలు వారి చదువులు, ఉద్యోగాలు వంటి విషయాలను చర్చించుకుని ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా నాడు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీఎస్ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు సీతారామమ్మ, స్వదేశీరాణి, రామ్మోహన్‌రావు, వెంకటేశ్వర్లు, లాజరేస్, దేవాసేలు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

పాత కక్షల నేపథ్యంలో దాడి

దమ్మపేట : పాత కక్షల నేపథ్యంలో కొందరు ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై దాడి చేసిన సంఘటన మండల పరిధిలోని లచ్చాపురం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 20వ తేదీన మల్కారం గ్రామానికి చెందిన కందుల సాయికుమారితో పాటుగా ఆమె భర్త, తాతయ్య కూలీ పనులు ముగించుకుని, ఆటోలో ఇంటికి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో వారు లచ్చాపురం గ్రామానికి చేరుకోగానే, అదే గ్రామానికి చెందిన గుంజి వంశీతో పాటుగా మరో ముగ్గురు వ్యక్తులు ఆటోను అడ్డగించి, ఆటోలో ఉన్న ముగ్గురు వ్యక్తులపై దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,881

అనాథలకు అండగా.. ఆపరేషన్ స్మైల్

- రెండేళ్లలో 118 మంది బాల కార్మికుల గుర్తింపు
- ఈనెల 31 వరకు కొనసాగనున్న కార్యక్రమం



ఆపరేషన్ స్మైల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు (ఫైల్)

కొత్తగూడెంటౌన్: ఏ దిక్కూ లేని వీధి బాలలకు, పేదరికంతో చదువుకోలేక పనులకు వెళ్తున్న చిన్నారులకు.. తప్పిపోయిన, తప్పనిసరి పరిస్థితుల్లో బాల కార్మికులుగా మారుతున్న అభాగ్యులకు అండగా నిలుస్తోంది ఆపరేషన్ స్మైల్. జిల్లాలో గత రెండేళ్లలో ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ వంటి కార్యక్రమాలతో 118 మంది బాల కార్మికులను గుర్తించిన అధికారులు.. వారికి వెట్టి చాకిరీ నుంచి విముక్తి కలిగించారు. జిల్లాలో 5 సబ్ డివిజన్ల పరిధిలో ఆయా శాఖల అధికారులు ఐదు బృందాలుగా ఏర్పడి నిరంతరం పని చేస్తున్నారు. ఈ రెండు కార్యక్రమాల ద్వారా గతేడాది జనవరిలో 30 మంది బాలురు, ఐదుగురు బాలికలను, జూలైలో 56 మంది బాలురు, 12 మంది బాలికలను, ఈ ఏడాది ఇప్పటివరకు 10 మంది బాలురు, ఐదుగురు బాలికలను గుర్తించి, రక్షణ కల్పించారు.

బాలలకు శ్రీరామరక్షగా..

తల్లిదండ్రులను కోల్పోయిన, అనాథలైన, కుటుంబం నుంచి తప్పిపోయి ఎవరి ఆదరణకు నోచుకోక బాల కార్మికులుగా మారిన 18 ఏళ్ల లోపు వారికి రక్షణ కల్పించేందుకు ఆపరేషన్ ముస్కాన్, స్మైల్ కార్యక్రమాలను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. వారికి పని నుంచి విముక్తి కల్పించి చదువు చెప్పించడంతో పాటు భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తూ అండగా నిలుస్తోంది. ప్రతి మూడు నెలలకు ఓసారి ఈ కార్యక్రమాలను చేపడుతోంది. ఇందులో జిల్లా శిశు సంక్షేమ, కార్మిక, రెవెన్యూ, బాలల సంరక్షణ, పోలీస్ శాఖల అధికారులు బృందంగా ఏర్పడి జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తారు. ఇటుక బట్టీలు, పరిశ్రమలు, వ్యాపార సముదాయాల్లో తనిఖీలు చేపట్టి బాల కార్మికులను గుర్తిస్తారు. సమగ్ర బాలల పరిరక్షణ పథకం కింద వారికి కిట్లు ఇవ్వడంతో పాటు వారి సంరక్షణ బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుంది.

చిన్నారులతో పని చేయించొద్దు..



18 ఏళ్ల లోపు వారితో ఎవరూ పనులు చేయించుకోవద్దు. బాలలను పనిలో పెట్టుకున్నట్టు మా తనిఖీల్లో వెల్లడైతే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఈనెల 8 నుంచి 31 వరకు జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం చేపడుతున్నాం. బాల కార్మికులను గుర్తించి వారికి విద్య, వైద్యం తదితర సౌకర్యాలు కల్పిస్తాం. – స్వర్ణలతా లెనినా, జిల్లా శిశు సంక్షేమశాఖ అధికారి

హీటెక్కిన ఇల్లెందు

- నేడు పోటాపోటీగా ఆత్మీయ సమ్మేళనాలు
- ఒకరి సభకు మరొకరు వెళ్లకుండా..
- అనుచరులను కాపాడుకునేందుకు పక్కా ప్లాన్

ఇల్లెందు: ఇల్లెందు రాజకీయం హీటెక్కుతోంది. పోటాపోటీగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల ముందే ఒక ఆత్మీయ సమ్మేళనం తేదీ ఖరారు కాగా మరో ఆత్మీయ సమ్మేళనం ఒక్క రోజులోనే రాత్రికి రాత్రే ఖరారు అయ్యింది. ఒకరు తమ అభిమానులను కూడబెట్టుకునేందుకు ఏర్పాటు చేసుకుంటే, మరొకరు సభకు వెళ్లకుండా అడ్డుకునేందుకు ఏర్పాటు చేసుకున్నారనే చర్చ స్థానికంగా జరుగుతోంది. నిన్నటి వరకు ఒకే పార్టీలో ఉన్న వారు రేపటి నుంచి మరోలా మారబోతున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు ఏర్పాటు చేసిన శుభాకాంక్షల సభలే రాజకీయాలను హీటెక్కించాయి. ఆ వెనువెంటనే సీఎం కేసీఆర్ అటు భద్రాద్రికొత్తగూడెం, ఇటు ఖమ్మంలో పర్యటించిన సందర్భంగా కూడా పొంగులేటి, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్యలు పాల్గొనలేదు. కాగా, మంత్రులు హరీష్‌రావు, అజయ్‌కుమార్‌లు ఇల్లెందు సభలో అటు పొంగులేటిని, ఇటు కోరంను పరోక్షంగా విమర్శించిన తీరు చూస్తే వారికి ఆ పార్టీతో దూరం పెరిగిందని తెలిపోయింది. ఇప్పటికే పినపాకలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సోమవారం 23న ఇల్లెందులో 'ఆత్మీయ సమ్మేళనం'ఏర్పాటు చేశారు. దీంతో వారు ఏ పార్టీలోకి వెళ్తారనే విషయం ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు, అభిమానుల నుంచి 'ఫీడ్ బ్యాక్'తీసుకునే అవకాశం ఉంది. ఏదిఏమైనా కోరం, పొంగులేటిల పయనం ఎటు ఉంటుందనే అంశం కార్యకర్తలు, నేతల్లో నెలకొంది.

బీట్ మార్కెట్‌లో ఎమ్మెల్యే బృందం..

మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే హరిప్రియ, మార్కెట్ కమిటీ చైర్మన్ హరిసింగ్‌నాయక్‌లు సైతం 23వ తేదీన సభ నిర్వహిస్తున్నారు. మున్సిపల్ పాలక వర్గం మూడేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా పట్టణస్థాయిలో బీట్ మార్కెట్ కేంద్రంగా అదే రోజు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది. కాగా, పట్టణంలోని బీట్ మార్కెట్‌లో జరుగు మున్సిపల్ మూడేళ్ల పాలన సందర్భంగా పట్టణప్రజలో ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని ఎమ్మెల్యే, మార్కెట్ కమిటీ చైర్మన్, మున్సిపల్ చైర్మన్ పరిశీలించారు. ఇలా పోటాపోటీ సభలు, సమ్మేళనాలతో ఇల్లెందు రాజకీయాలను హీటెక్కిస్తున్నారు.



బీట్ మార్కెట్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ బృందం

లలితాపురం తోటలో పొంగులేటి, కోరంల బృందం..



లలితాపురం తోటలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య బృందం

సోమవారం 10గంటలకు ఇల్లెందులోని లలితాపురం మామిడితోటలో జరుగు ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య కోరారు. ఆదివారం ఆయన తన అభిమానులతో కలిసి తోటలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. సమ్మేళనానికి నియోజకవర్గం నుంచి అభిమానులు అత్యధికంగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ఎట్టకేలకు 'వర్కర్ల' సమ్మె విరమణ

- 86 రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళన
- సమస్యల పరిష్కారానికి అధికారుల హామీ



పాల్వంచ: పాల్వంచ ఆశ్రమ పాఠశాల వద్ద నిమ్మరసం తాగించి దీక్షలను విరమింప జేస్తున్న రాములునాయక్



టేకులపల్లి: నిమ్మరసం తాగించి సమ్మె విరమింపజేస్తున్న సర్పంచ్‌లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

పాల్వంచ/టేకులపల్లి: జిల్లాలోని అన్ని గిరిజన సంక్షేమ పాఠశాలల ఎదుట డైలీ వేజ్ వర్కర్లు చేపట్టిన దీక్షలను ఆదివారం ఎట్టకేలకు విరమించారు. గత 86 రోజులుగా తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా జిల్లాలో సైతం పలు రూపాల్లో తమ ఆందోళనలను ఉధృతంగా నిర్వహించారు. తమను రెగ్యులరైజ్ చేయడంతో పాటు, పీఆర్‌సీ ఫిట్‌మెంట్ 30శాతం, పెండింగ్‌లో ఉన్న 12 నెలల వేతనాలు విడుదల చేయాలని, సమాన పనికి సమాన వేతనం అందించాలని, ఔట్ సోర్సింగ్ విధానాన్ని వర్తింపజేయొద్దని, ఆరోగ్య బీమా కల్పించి హెల్త్ కార్డులు ఇవ్వాలని, చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు అంత్యక్రియలకు ఖర్చులు ఇవ్వాలని, మహిళలకు ప్రసూతి సెలవులు ఇవ్వాలని తదితర డిమాండ్ల కోసం అన్ని పాఠశాలల ఎదుట దీక్షలను కొనసాగించారు. జిల్లాకు వచ్చిన మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులకు వినతి పత్రాలను అందించారు. ఈ క్రమంలో టీఎస్ టీడబ్ల్యూటీయూ రాష్ట్ర శాఖతో పాటు, డైలీవేజ్ వర్కర్లు అధికారులతో జరిపిన చర్చల నేపథ్యంలో ఐటీడీఏ అధికారులు సమస్య పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. పెండింగ్ జీతాలు వెంటనే ఇవ్వడంతో పాటు ప్రతి నెలా వేతనాలు క్రమం తప్పకుండా ఇచ్చేలా హామీ ఇవ్వడంతో ఆందోళనలు విరమించేందుకు నిర్ణయం తీసుకున్నారు. సోమవారం పూర్తి ఫలితాలు వస్తాయని ఆదివారం సమ్మె విరమించి విధుల్లో చేరాలని చెప్పడంతో సమ్మె విరమించామని డైలీ వేజ్ వర్కర్లు తెలిపారు. కాగా, పాల్వంచలోని ఆశ్రమ పాఠశాల ఎదుట చేపట్టిన నిరాహార దీక్షల్లో బైఠాయించిన కార్మికులకు టీఎస్ టీడబ్ల్యూటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రాములునాయక్, 4వ తరగతి ఎంప్లాయిస్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు బి.రాంజీనాయక్, జిల్లా మాజీ అధ్యక్షుడు ఎ.పుల్లయ్య నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. అలాగే టేకులపల్లిలోని కోయగూడెం ఆశ్రమ పాఠశాల సమ్మె శిబిరం వద్ద సర్పంచ్‌లు పూనెం ఉమ, జోగ రేణుక, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భూక్య కిషోర్‌సింగ్, టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ హరిలాల్ నాయక్, ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం బాణోతు అమర్‌సింగ్‌లు సమ్మె చేసిన డైలీవేజ్ వర్కర్లకు నిమ్మరసం తాగించి విరమింపజేశారు. కార్యక్రమంలో పాల్వంచ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు చెన్నారావు, వర్కర్లు సేవ్యా, కృష్ణకుమారి, బాబురావు, నాగరత్నం, నర్సింహారావు, గరిక నాగులు, దారావత్ వెంకట్రాం, శ్రీను, బచ్చలి ఎర్రమ్మ, పూనెం బాలమ్మ, చీమల ధనలక్ష్మి, కోటేశ్వరరావు, భద్రం, వెంకట్రావ్, అర్జున్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగిసిన జోనల్ స్థాయి క్రీడలు



పాల్వంచ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న సీసీఎఫ్ భీమానాయక్

పాల్వంచ: గత రెండు రోజులుగా స్థానిక నవభారత్ పబ్లిక్ స్కూల్‌లో జరుగుతున్న అటవీ శాఖ జోనల్ స్థాయి క్రీడా పోటీలు ఆదివారం సాయంత్రం ఉత్సాహంగా ముగిశాయి. ఈ క్రీడా పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా పాల్వంచ జట్టు నిలిచింది. ఇటీవల విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఫారెస్ట్ రేంజ్ అధికారి సీహెచ్.శ్రీనివాసరావు జ్ఞాపకార్థం క్రీడా పోటీలను నిర్వహించగా భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలకు చెందిన వందలాది మంది ఉద్యోగులు క్రీడల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అథ్లెటిక్స్, వాలీబాల్, క్రికెట్, షటిల్, కబడ్డీ తదితర క్రీడా పోటీలను నిర్వహించగా..ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన పాల్వంచ టీంకు భద్రాద్రి కొత్తగూడెం సర్కిల్ ఛీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ బి.భీమానాయక్ ట్రోఫీ అందజేశారు. అదేవిధంగా జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులను, కళాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా భీమానాయక్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో తలమునకలై ఉండే వారికి క్రీడలు ఆటవిడుపుగా ఉంటాయని, ఆరోగ్యకర వాతావరణానికి ఎంతో అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల ఎఫ్‌డీఓలు లక్ష్మణ్ రంజిత్ నాయక్, రవికిరణ్ , సిద్ధార్థ విక్రమ్ సింగ్, అపర్ణ, వసంత, నీరజ్‌కుమార్, తిరుమలరావు, దామోదర్ రెడ్డి, అప్పయ్య, బాబు, మక్సూద్, ఎఫ్ఆర్‌ఓలు అనిల్‌కుమార్, సురేష్, రవికిరణ్, శ్రీనివాస రెడ్డి, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల సమస్యలపై నిరసన ర్యాలీ



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న డీడీ రమాదేవి, ఎస్సై టీవీఆర్ సూరి

పినపాక: ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థినుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. మండలంలోని ఐలాపురం నుంచి పాదయాత్రగా భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం వరకు బయలుదేరి వెళ్లారు. పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఎటువంటి ఆధారాలు లేకుండా సస్పెండ్ చేసిన పాఠశాల హెచ్‌ఎం, వార్డెన్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేయడంతో పాటు వారి పక్షాన ఎస్ఎఫ్ఐ పోరాడుతుందని తెలిపారు. రామనుజవరం వరకు చేరుకున్న ర్యాలీని పోలీసులు అడ్డుకొని పాఠశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న డీడీ రమాదేవి పాఠశాలకు చేరుకొని సమస్యలపై ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడిన ఆమె ఎస్ఎఫ్ఐ నాయకులు రమ్మని చెప్పడంతో మేము వెళ్లామని విద్యార్థినులు చెప్పడంతో డీడీ ఫిర్యాదు మేరకు ఎస్ఎఫ్ఐ నాయకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై టీవీఆర్ సూరి తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సీఐటీయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా మధు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న బి.మధు సీఐటీయూ అఖిలభారత జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ నెల 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు బెంగళూరులో నిర్వహించిన జాతీయ మహాసభల్లో ఈ ఎన్నిక జరిగింది. గతంలో ఆయన ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, సీఐటీయూ అనుబంధ బీఎస్ఎన్ఎల్ , రైల్వే, బ్యాంకు, హాస్టల్ డైలీవేజ్ తదితర రంగాల కాంట్రాక్ట్ కార్మిక సంఘాల్లో పనిచేశారు.

పాదయాత్రను భద్రాచలం నుంచే ప్రారంభించండి

రేవంత్ రెడ్డిని కోరిన పొదెం వీరయ్య



రేవంత్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొదెం వీరయ్య, నాయకులు

భద్రాచలం: పాదయాత్రను భద్రాచలం నుంచే ప్రారంభించాలని కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కోరినట్లు టీపీసీసీ ఉపాధ్యక్షుడు, డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య తెలిపారు. పొదెం వీరయ్య ఆదివారం భద్రాచలం నాయకులతోపాటు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో రేవంత్ రెడ్డిని కలిసి మాట్లాడారు. ఫిబ్రవరి 6వ తేదీన చేపట్టే హాథ్ సే హాథ్ జోడో పాదయాత్రను శ్రీ సీతారామ చంద్రస్వామి వారి సన్నిధి నుంచి ప్రారంభించాలని కోరినట్లు పేర్కొన్నారు. యాత్ర ఇక్కడి నుంచి ప్రారంభిస్తే లక్షమందితో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్, నాయకులు బలుసు సతీష్, ఉబ్బ వేణు, కొత్తగూడెం, పినపాక నియోజకవర్గాల నాయకులు పాల్గొన్నారు.

ఐలూ జిల్లా కార్యవర్గం ఎన్నిక



ప్రసాద్ రావు, రమేష్ కుమార్ మక్కడ్

భద్రాచలం: ఆల్ ఇండియా లాయర్స్ యునియన్ (ఐలూ) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం భద్రాచలంలో జరిగిన జిల్లా మొదటి మహాసభలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా ఎంవీ ప్రసాద్ రావు, ఉపాధ్యక్షులుగా పానుగోటి కిషన్‌రావు, టి.వసంత రావు, సుడిగాలి వెంకట నరసయ్య, గడదేసి కాంతయ్య, ప్రధాన కార్యదర్శిగా రమేష్ కుమార్ మక్కడ్, జిల్లా కార్యదర్శులుగా మహ్మద్ సాధిక్ పాషా, జికే.అన్నపూర్ణ, జాడి చొక్కారావు, టి.చైతన్య జిల్లా కోశాధికారిగా కిలారు పురుషోత్తంలను ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ సభ్యులుగా బండారు అరుణ్ చంద్, పాయం రవివర్మ, ఉప్పు గౌతం కుమార్, దాసరి కవిత, లావణ్య, పోశం భాస్కర్, మేదరమెట్ల శ్రీనివాస రావు, రావిలాల రామారావు, కటకం పుల్లయ్య, అరికల రవి కుమార్, ఆర్తీ మక్కడ్, గాదె సునంద, అరకల రవి కుమార్, దూదిపాళ్ల రవి ఎన్నికయ్యారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

టేకులపల్లి: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి సులానగర్ సమీపంలో చోటు చేసుకుంది. టేకులపల్లి ఎస్సై భూక్య శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో సులానగర్ దాటిన తర్వాత టీఎస్28డి 3502 నంబర్ గల ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ యువకుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో టేకులపల్లి ఎస్సై సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి ఫోన్, బైక్ నంబర్ ఆధారంగా మృతుడి పేరు చీరా కుమార్(28) అని తెలిసిందని ఎస్సై తెలిపారు. అయితే వాహనం నంబర్ ప్రకారం వచ్చిన పేరు, మృతుడు ఒక్కడేనా, ప్రమాదం ఎలా జరిగిందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్యాయత్నం

ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరం



తీవ్రగాయాలపాలైన సురేష్

జూలూరుపాడు: మండలంలోని కాకర్ల గ్రామానికి చెందిన ఓ యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మందనపు సురేష్ హమాలీ, వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం గ్రామం నుంచి గానుగపాడు వెళ్లే మార్గంలో ఉన్న మామిడి తోటకు వెళ్లి సురేష్ తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని నిప్పంటించుకున్నాడు. దీంతో మంటల్లో చిక్కుకున్న సురేష్ కేకలు వేయడంతో అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి గమనించి గ్రామస్తులకు సమాచారం అందించాడు. గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకునే లోపే సురేష్ చర్మం, దుస్తులు కాలి తీవ్ర గాయాలతో రోడ్డుపైకి వచ్చాడు. వెంటనే స్థానికులు కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు పరీక్షించి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు చెప్పినట్లు సురేష్ కుటుంబసభ్యులు తెలిపారు. బాధితుడికి భార్య ఉంది. అయితే సురేష్ గత కొంతకాలంగా క్రికెట్ బెట్టింగ్, కోడి పందేలు, పేకాట ఆడేందుకు అప్పులు చేసేవాడని, అప్పులు మరింతగా పెరగడంతో అప్పు ఇచ్చిన వారు సురేష్‌పై ఒత్తిడి తెస్తుండటంతో అతను ఈ ఘటనకు పాల్పడినట్లు స్థానికులు తెలిపారు.